# రంగడి ప్రయోజకత్వం

ఏ పాటు తప్పినా సాపాటు తప్పదన్నారు పెద్దలు.

అలాగే ఏది తప్పినా వేళకు భోజనం మాత్రం తప్పనివ్వని నిత్యసత్య నియమపాలకుడు మన రంగారావుగారు. ఇతణ్ణే అందరు ముద్దుగా 'రంగడూ' అంటారు.

రంగడంటే తల్లి అనసూయమ్మకు పంచప్రాణాలు.

ఈ పూల రంగడు ప్రతిరోజూ 12గం॥ 45 నిమిషాలకల్లా ఇల్లుచేరి టంచన్‌గా అలారం మ్రోగినట్లు 'అమ్మా వొడ్డించావా? ఆకలి దంచేస్తుందే' అంటూ భోజనానికి సిద్ధమై రావటం ఆనవాయితి. అలాంటి కుమార రత్నం ఈ వేళ ఎందుకో? సూరీడు నడినెత్తిపై నుండి దాటి పయనించినా, రాకపోయే సరికి ఏదో వెలితిగా ఫీలౌతూ అందోళన పడసాగింది అనసూయమ్మ.

ఓ అయిదు నిమిషాల పాటు, అటూ ఇటూ తాచ్చారాలాడి చివరకు దిగులుగా భర్త జానకిరామయ్యగారి చెవిలో వేసింది విషయాన్ని.

అయితే ఏం? జానకిరామయ్య దేనికీ చెమర్చని బండరాయిలాంటి మనిషి. ఐనా, సుపుత్రుని ఆంతర్యం బాగా ఎరిగినవాడు కాబట్టి, కాస్త విస్తుపోయాడు. నిజానికి, సాధారణంగా, సగటు మనుష్యులంతా ఏ రేడియో టైమో టి.వీ టైమో చూచి తమ వాచీల్లో ముల్లు సరిదిద్దుకుంటారు. కానీ, జానకిరామయ్యగారి ఇంట్లో మాత్రం రంగారావు గారి ప్రవేశమే సమస్త గడియారాలు సవరించుకునే సమయానికి సాక్షిగా నిలుస్తుంది. ఆ విషయాన్ని బాగా గమనినంచిన జానకి రామయ్య గారు కాస్త కంగారుపడ్డా.

కారణం ఏమై వుంటుంది చెప్మా? అదో? ఇదో? మరోటో? ఇంకోటో? అంటే ఏమో? కానీ కేవలం కుక్షింభరుడుగా భావిస్తున్న మావాడు పొట్టపూజకు ఈనాడు వేళను తప్పించాడంటే మాత్రం నమ్మశక్యం గాని సమస్యే! అంటూ ఆలోచనలో కొంతసేపు కదలాడినా? జానకిరామయ్యగారి మనస్సు సర్దుకుంది.

కొడుకు మూతిపై మొలిచిన నూనూగు మీసపు మొలకలు కట్టుగా మారబోతున్న దుడుకు రోజులవి. మరి! తన కుమారరత్నం కూడా ఏదైనా నూతన ప్రయోగంలో తలదూర్చి ప్రయోజకుడు కాబోతున్నాడేమో? అంటూ వో త్రుటికాలం మెదడుకు పనిచెప్పబోయి, వెంటనే ఆ శ్రమంతా, తనకెందుకన్నట్లు భోంచేసి పగటి నిద్రకోసం పడకింట్లోకి వెళ్లి పోయారు.

పాపం! అనసూయమ్మకు మాత్రం ఏమీ తోచడం లేదు. కాలుగాలిన పిల్లలా ఇల్లంతా తిరిగింది. పాత్రలన్నీ శుభ్రంగా సర్దుకుంది. అంట్లన్నీ అవతలేసింది. కొడుకు మీదినుండి ధ్యాస మళ్లించుకోవడానికి, లేని పనులెన్నో కల్పించుకుంటూ అన్నీ పూర్తి చేసింది.

అయినా ! రంగడు ఇంకా ఇంటికి రాలేదు.

సమయం దాదాపు నాలుగ్గంటలు కావస్తూంది.

ప్రొద్దుటే గారెల కంటూ నానబోసిన పప్పు రుబ్బుకుంది. గారెలొత్తి కాల్చింది. అవి బాగా పొంగి కరకరలాడుతున్నాయి. గారెలు కాలుస్తున్నంతసేపూ అనసూయమ్మ మనస్సు కొడుకు చుట్టూ తిరుగుతూ ఉంది. భోజన సమయం దాటినా, టీ టైంను తప్పనిస్తాడా? వండుతున్న ఈ గారెల వాసన పసిగట్టాడంటే, అరమైలునుండే పరుగులు తీస్తూ వచ్చి, ఆవురావురు మంటూ కనీసం డజను గారెలైనా నమలకుండా వూర్కోడు. తన రంగడు, అనే విషయం అమె మనస్సులో మెదుల్తూనే వుంది.

ఛీ! ఉత్తతిండిబోతు వెధవ, వీడెట్లా ప్రయోజకుడౌతాడో? అంటూ చీదరతో అసంతృప్తిని కనబరుస్తూనే చిరునవ్వుతో ఆప్యాయాన్ని పంచింది అనసూయమ్మ హృదయం.

ఎందుకైనా మంచిదంటూ గారెలతో పాటే వేడివేడిగా 'టీ' కూడా కాచి సిద్ధం చేసి ఫ్లాస్కులో పోసి ఉంచింది.

నిద్రలేచి కాళ్లూ ముఖం కడుక్కుంటున్న భర్త జానకిరామయ్య ముక్కుపుటాల్లోకి కూడా గారెల వాసన ప్రవేశించి ఏవో రుచులకు గిలిగింతలు పెట్టినట్లున్నాయి. ఆయన హుషారుగా నవ్వుతూ -

' ఏమోయ్? ఏమిటీ విశేషం. నేను లేచిలేవక మునుపే 'టీ' ఫలహారాలు సిద్ధం చేసి స్వాగతిస్తున్నావ్? ' అంటూ పయిలా పచ్చీసు వయస్సులో ఉన్నవాడిలా వేళాకోళాలాడుతూ.

నిజమేనోయ్! అన్నా! ఈ వేళ నాకెందుకో మన పెళ్లినాటి తొలిరోజులు జ్ఞాపకానికొస్తున్నాయ్. పెళ్లై ఇరవైఏడు సంవత్సరాలు ఎలా గడిచాయో? నక్షత్రమాల తిప్పినంత వేగంగా వెళ్లిపోయాయి. అవునూ! రంగడు కనిపించడేం?

ఈకమ్మటి వాసనకు నేనే తట్టుకోలేందీ! వాడేం ఆగి నిలుస్తాడు. గారెల పళ్లెం పట్టుకెళ్లి తన గదిలో కూర్చుని ఇదివరకే సగం కాజేసి ఉంటాడులే! నిద్రకూ, తిండికి వాడు పెట్టింది పేరు. ఉత్త కుంభకర్ణుడు' అంటూ ఎదుట ఉంచిన పళ్లెంలోంచి వో గారె అందుకుని కొరికి, ఆ రుచిని అనుభవిస్తూ నిద్రలేచిన సుఖం, మనస్సుకూ శరీరానికి హాయిని పంచుతూ వుంటే 'టీ'ని కప్పులో పోసుకుని చప్పరించడం ప్రారంభించాడు. అనసూయమ్మకేసి చూస్తూ గారెలు రుచిగా కుదిరాయి అంటూ కళ్లల్లో చిలిపిరేఖలు దోబూచులాడుతూంటే మెచ్చుకుంటున్నాడు కూడా!

భర్త మెప్పులు వింటున్న అనసూయమ్మకు చీమలు పాకుతున్నంత చిరాగ్గా ఉంది. జానకి రామయ్య పళ్లెంలోంచి మరోగారెను అందుకుంటూంటే అనసూయమ్మకు తాను కష్టపడి వండిన వంటకాన్నంతా పరాయి వాడెవడో అనుభవిస్తూన్నంత బాధ కలిగింది.

తన కొడుకు తిండి మాని యింటికి రాకుండా ఎక్కడో చిక్కి ఏం తిప్పలు పడ్తున్నాడో? అలాంటి వాడిని గూర్చి చీమకుట్టినంత కదలికకూడా లేకుండా ప్రవర్తిస్తున్నాడు.

'పిచ్చికన్న' లేక లేక పుట్టిన ఒక్కగా నొక్క మగబిడ్డ. అలాంటి బిడ్డ యింతవేళ మించినా యిల్లు చేరలేదనే ధ్యాసకూడా లేకుండా హాయిగా విలాసాలు పోతున్నారు యీయన అంటూ భర్తపై రుసరుసలాడింది. అంతేకాదు, తాను ఆ గారెలు వండి తప్పు చేశాననుకుంది. ఇలా వో పదినిమిషాలు గడిచినా రంగడు యింట్లో వున్న జాడకనిపించకపోయే సరికి జానకి రామయ్య కంగారుగా -

'అనూ! రంగడింకా యింటికి రాలేదా?' అంటూ ప్రశ్నించాడు.

ముక్కుచీతూ 'రాలేదు' అంటూ దీర్ఘాలు తీసింది అనసూయమ్మ. చేతిలో వున్న గారెను పళ్లెంలో పడేస్తూ చేతులు కడుక్కుని బయటి వరండాలోకి వచ్చి కూర్చున్నాడు జానకి రామయ్య.

అప్పుడే పక్కింటి తాయారమ్మ కూతురు విజయ స్కూల్ ఫైనల్ చదువుతూ వుంది. ఇంటికి వచ్చినట్లుంది.

పాపం! తాయారమ్మ వొంటికత్తె. ఏమూలో ఏదో సర్దుతూ వుండి వుంటుంది. అందుకే తలుపులు బాదినా వినిపించుకోవడం లేనట్టుంది. ఈ మధ్యలో ముదనష్టపు దొంగల బెడద ఎక్కువై వో పది నిముషాలపాటు గుమ్మం తలుపులు తెరచి వుంచడానికి వీలు లేకుండా పోయింది.

ఎప్పుడు? ఎవడు? ఏ రూపంలో వచ్చి జొరబడ్తాడో? ఎలా తెలుస్తుంది. కంటెలూ, కడియాలూ తేకపోయినా యింట్లో వున్న ఏ చెంబో? తప్పాలో ఎత్తుకపోతే చాలదూ? పట్టుకెళ్లిన వస్తువు మనకు అలవాటైన మూలాన్ని ఆ వస్తువు దొరక్క చెయ్యి విరిగినట్లు అల్లాడ్తాం.

ఇత్తడికి పుత్తడిలా ధర పెరిగిన యీ రోజుల్లో దొంగకు చెప్పే లాభంగా ఆ వస్తువుకు నాల్గు రాళ్లు రాలక పోతాయా? పాపిష్టికాలం. అందుకని తలుపు గడియ వేసి వుంచి వుంటుంది. 'గడియ' ఏమిటీ నా మొకం పాత పదాలే దొర్లుతాయి. అదేదో బోల్టు పెట్టివుంటుంది. ఆ పిల్లేమో పాపం! ఎండ పడి వస్తూ తలుపులు తీయుమంటూ బాదుతూంది కాబోలు ! అంటూ పక్కింటి వారిపై సానుభూతి ప్రకటించింది అనసూయమ్మ.

' ఏమిటే? నీ అఘాయిత్యం గూల. తలుపులు విరిగేను, అంత సేపు సహించిన దానివి యింకో పిసరు వోపిక పట్టలేవూ? నీ కోసమే వుప్మా వేడిగా చేస్తానంటూ కరివేపాకు కోసం వెదుకుతున్నాను. వంటింటి పనిలో మునిగిన నాకు నీ మాట ఎలా వినిపిస్తుంది ? తలుపులు బార్లా తెరిచి ఎలా వుంచేది? వినలేదా? 'తెరచి ఉంచిన ఇల్లు కుక్కదూరు' అంటూ వేమన చెప్పిన సుభాషితం? అయ్యో నా తెలివి తెల్లారినట్లే వుంది. ఈ రోజుల్లో వేమన్న ఎవడికి కావాలి? అంతా 'డింగ్ డాంగ్ బెల్స్' తప్ప' అంటూ గొణుక్కుంటూనే, కూతుర్ని ఆప్యాయంగా లోపలికి ఆహ్వానించింది.

అనసూయమ్మ ఎదలు చల్లబడ్డాయి.

అనసూయమ్మ వాటాకు రెండో ప్రక్కన ఉన్న రామనాథంగారింట్లో ఈ పూట ఏదో కొత్త అలికిడి వినిపించింది.

రామనాథం గారి కొడుకు భాస్కర్ తన కొడుకు రంగని ఈడు వాడే ! కాలేజీ నుంచి వచ్చినట్లున్నాడు. ఎం. ఎ.లో సీటొచ్చినందుకు తండ్రి కొత్త స్కూటరు కొనిచ్చాడేమో?

ఆ కొత్తమోజులో స్కూటరును మాజోరుగా చప్పుడు చేయిస్తూ గేటు దాటించి, లోపలికి తీసుకెళ్లి పార్కు చేసి తాళపు చెవిని విలాసంగా వూపుతూ పక్క తాళంగా విజిల్ వేస్తూ మెట్లెక్కి పోతున్నాడు.

ఈ దృశ్యం కంటపడ్డ అనసూయమ్మకు కడుపులో చేయిపెట్టి కలిచినట్లై రంగడు కళ్లల్లో మెదిలాడు. మరోసారి గుమ్మం అవతలికి పారజూస్తూ ఆరాటపడింది.

ఇంతలోకే ఎదురింటి సౌదామణి సవతి కూతురు పద్మ, అప్పుడే విప్పుకుంటున్న తామర మొగ్గలా వుంది. బి. ఏ. ఫైనలియర్ చదువుతూవుంది.

ఆ పిల్ల వచ్చీరాకముందే దండకం ప్రారంభిస్తుంది సౌదామణి. పాపం, సౌదామణికి శరీరంలో ఎన్ని అవయవాలున్నాయో? ఆ అవయవాల్లో ప్రతిరోజూ ఏదో వో అవయం విపరీతమైన బాధకు లోనౌతుంది. పద్మ మంచి నీళ్లైనా ముట్టుకోక పూర్వమే, లేని బాధను నటిస్తూ నడుముకు చేయిచేర్చి.

దొరసాని గారు ప్రవేశించి ఎంతసేపైందో? ఇకనన్నా వంటింట్లో కాస్త కాలూని నా మొకాన ఇన్ని కాఫీ నీళ్లు తగలేస్తారా? కాక మరో రాచకార్యమంటూ రోడ్లన్నీ బలాదూరుగా చుట్టివస్తారా? ఇంటెడు చాకిరి, ఒంటరిదాన్ని చేసీ, చేసీ నడుం పడిపోతుంది. ఈ పని మాత్రం నాకు వదిలేయకు సుమా! అంటూ ఆ పిల్లను పీక్కు తింటూ నానా మాటలతో సాధిస్తుంది.

ఆ మాటలన్నీ రివ్వుమంటూ వచ్చి అనసూయమ్మ చెవ్వుల్లో సూదుల్లా గుచ్చుకుంటున్నాయి. అయినా ఏం చేస్తుంది?

'ఓరి భగవంతుడా? బంగారం లాంటి పిల్ల పద్మ. దాని చెర ఎప్పుడు విడిపిస్తావో? మా బడుద్దాయి కాస్త బుద్ధిమంతుడై చక్కగా చదువుకొని వో డిగ్రీ సంపాదించి వుంటే. కానీ కట్నం అడక్కుండా ఈ పద్మని, నా కోడల్ని చేసుకుని ఉందును.

ఇంతకు పెట్టి పుట్టొద్దూ? అంత భాగ్యానికి నోచుకునేందుకు. అంటూ ఆలోచనలకు పందరివేస్తూ వుంటే -

'కోడలు' అన్న పదం వెంటనే అనుబంధంగా వచ్చే కొడుకు అనే పదం తారసిల్లి ఇందాకా, కొంత తడవు మరపున పడ్డట్లున్న రంగడు ఇంకా ఇంటికి రాలేదన్న విషయం మళ్లా పదునెక్కి ఆమె కడుపులో ఏదో వికారాన్ని కల్పించడం ప్రారంభమైంది.

పసిపాపలా పొద్దంతా తన కొంగు పట్టుకు తిరిగే కొడుకు, ఇంకా ఇంటికెందుకు రాలేదా? అంటూ మనస్సు పరిపరివిధాల పోతూ ఉంది. 'ఇల్లిడిస్తే పిల్లికరిచే' నంటూ ఇల్లు వదిలి వో పూట తిండికి సరిపోయే డబ్బులు సంపాదించుకోలేని అమాయకుడూ, అంబేదా అంటే పనికిరాని ఉత్త దేబె అప్రయోజకత్వం, తల్లి దృష్టిలో అమాయికత! పోనీ లెండి! ఏదో ఒకటి మనకెందుకూ!

అది కడుపు తీపి. వినోదానికి వింటున్న మనకెలా తెలుస్తుంది? తల్లి కడుపుకోత? ఎలా భాసిస్తే అలా నమ్ముతుంది. ఆ మాటే అంటుంది.

గడియారం మాటదాటని మర్యాదస్తుడిలా వంచిన తల ఎత్తకుండా తన పని తాను చేసుకుంటూ పోతూనే ఉంది.

అనసూయమ్మ ఆరాటంతోకానీ, రాజాధిరాజుల కంటి సైగలతో కానీ నిరుపేద నిట్టూర్పులతో కానీ దానికి పనే లేదు. అందుకు సాక్ష్యంగా జానకిరామయ్యగారి గోడమీది గడియారం చిన్న ముల్లు రాత్రి ఎనిమిది చూపుతూ ఉంది.

టి.వీలో చిత్రహార్ ప్రారంభం కాబోతుంది.

ఇంట్లో ఉన్నంతసేపూ రంగడు టీ.వీ. ముందే కాపురముండేవాడు. తారాస్థాయిని అందుకున్న సౌండులో పాటలు, జోకులతో, ఊపులతో ఊగులతో, గంతులతో,

గల్లంతులతో, తాకులతో, తడాకాలతో జోరుగా సాగుతూ ఉంటే తాను శివమెత్తినట్లు ఊగిపోయేవాడు రంగడు. చూచేవారికి అదో చిత్రం!

ఈనాడు ఆదరించి, హర్షించే రంగారావుగారు లేక టి.వీ మూగవోయింది. అంతెందుకూ? రంగారాయడి వ్యక్తి స్పర్శలేని కుర్చీ చిన్నపోయి విరహిణిలా కూర్చుంది. ఆ గదే బోసి పోయినట్లు బిక్కు బిక్కుమంటూంది.

చెవులు చిట్లి చిల్లులు పడే స్థాయిలో వినిపిస్తూన్న పాటల ఘాటును తట్టుకోలేక-

అబ్బబ్బా! అ వాల్యూం కాస్త తగ్గించరాదూ? మరీ అంత హైపిచ్‌లో పెడ్తే తప్ప పాటలు వినిపించవా? చెవుడా? రక్తికి భంగమా? అంటూ విసుక్కునే జానకిరామయ్యకు కూడా అదోలాంటి వెలితి కనిపించింది.

ఐనా, పైకి ఆ వెలితినీ, ఆందోళనను కనిపించనీయకుండా, కొడుకు స్థానంలో తాను చప్పట్లు చరుస్తూ ఏమీ పట్టించుకోని మనిషిలా 'తొమ్మిదయ్యే సరికి భార్యను కేకేసి అన్నం వడ్డించమన్నాడు.

అనసూయమ్మ ముభావంగానే జానకి రామయ్యగారికి అన్నం వడ్డించింది. ఆయనక్కూడా భోజనం అంతగా సహించినట్లు లేదు. అయినా ఉల్లాసంగానే వేడివేడి రసంతో రెండు ముద్దలు తిన్నట్లు చేసి-

అయితే, అన్నూ! నీ సుపుత్రుడు ఈనాడు పూర్తిగా మగమహారాజైనట్లున్నాడు. కోరికోరి ఉపవాసాలూ, వ్రతాలు చేసి మరీ కన్నావు. అచ్చం మేనమామ పోలిక. సమయానికి కాకపోయినా, నిశిరాత్రి కొంప చేరుకునే సదాచారానిక్కూడా తిలోదకాలిచ్చేశాడు నిగమశర్మ!

అయినా సమాధానం రాలేదు. శ్రుతి మించితే ప్రమాదం ముంచుకొస్తుందని జానకిరామయ్యగారు తగ్గుతూ వోదార్పుగా -

ఏం జేస్తాం? పిల్లల్ని కంటాంగాని వారి భవిష్యత్తును కన్నామా? నేనూ ఇంకొంచెం సేపు నీతో పాటే కూర్చుంటాను. నీవు తినే ఆ ఫలహారమేదో ముగించుకో' అన్నాడు.

భర్త చూపించే ఈ అనురాగం అమె గుండెలను నిండిస్తూ రెండు కళ్లను స్రవింప చేసేలా ఉంది. కట్టలు తెంచుకుని వచ్చే ఆ ప్రవాహాన్ని రెప్పల బిగువున ఆపుకుంటూ.

వొద్దండి, నాకు సహించడంలేదు, అంటూ ముక్తసరిగా సమాధానం చెప్పి 'ఏవండీ! మనబ్బాయి ఇంతసేపై ఇంకా ఇంటికి రాలేదు. ఎందుకో ? అన్నది.

అన్నూ! నీ కొడుకు ఇంకా అడ్డాలబిడ్డ అనుకుంటున్నావా? నీ గుడ్డి ప్రేమ వాడి వయస్సును గూర్చి ఆలోచించనీయడం లేదు. మీసాలొచ్చిన మగరాయుణ్ణి నీ పొత్తిళ్లలో పెట్టి పెంచుతా నంటే ఎలా?

కాస్త స్వేచ్ఛ ఇవ్వు. ప్రతి పూటా అడిగిందల్లా ఇస్తూ సుష్టుగా భోజనం పెడ్తూ వాడిని, ఉత్త తిండి పోతు తిమ్మయ్య చక్రవర్తిని చేశావ్.

పనిలేని శరీరం వ్యాపకాలను కోరుతూ ఉంటే, నీరసించిన బుద్ధి తిక్క తిరుగుళ్లను నేర్పుతూంది. అంతే! చూచీ చూడనట్లుండడం నేర్చుకో, రాక ఎక్కడికిపోతాడు, వస్తాడులే! అంటూ వార్తలు వినడంలో మునిగిపోయాడు.

అనసూయమ్మ మజ్జిగ తాగి, సామాన్లన్నీ సర్ది పడగ్గదిలోకి వెళ్లిపోయింది.

భార్యభర్తలిద్దరూ రాత్రంతా దాదాపు మెలకువగానే ఉన్నారు.

పాపం! ఈ వయస్సులో ఈ బాధేమిటి? ఇంతకన్నా పున్నామ నరకమే మేలేమో?

ఒకరు లేస్తారని మరొకరు జాగ్రత్తపడ్తూ ఓ పక్కనుంచి మరో పక్కకు దొర్లుతూ, కొడుకు ఇంటికి రాని కారణాలను బేరీజు వేసుకుంటూ భార్యాభర్తలిద్దరూ ఏదో వో కునుకు తీసి ఉంటారు.

తెల్లవారింది.

జానకిరామయ్య లేచాడు. ఓ మారు భార్యవంక చూచి సరాసరి వంటింట్లోకి నడిచి స్టౌ వెలిగించి టీ కాశాడు. లేని హుషారు తెచ్చిపెట్టుకుంటూ -

'ఏమండీ! అనసూయా దేవిగారు, లేవండి, లేచి దాసుడిచ్చే ఈవేడి టీని తాగండి అన్నాడు. బరువెక్కిన గుండెలను హాస్యంతో తేలిక పరుస్తూ.

భర్త మాటలు వింటూన్న, అనసూయమ్మకు అమృతం విషం కలిపి సేవిస్తున్నట్లుగా ఉంది. అయినా ఏ స్పందన లేకుండా లేచి బాత్‌రూంలోకి నడిచి అవసరాలు ముగించుకుని స్నానానికి ఉపక్రమించింది.

జానకి రామయ్యగారు టీ తాగి న్యూస్ చదువుతున్నారు.

ఇంతలోకే ఏదో గాలి వీచినట్లైంది. ఫ్రంట్ గేట్‌ను కాలితో తంతూ మహాయుద్ధం సాధించిన వీరు డిలా ఫీలౌతూ, వంకర టింకర ఫోజ్‌లో కుడికాలూపుతూ, రేగిన జుట్టుతో, పీక్కుపోయిన కళ్లతో, మురికికొట్టుకున్న బట్టలతో, 'అమ్మా! అమ్మా! ఏం జేస్తున్నావే? నాన్నా! మీరంతా ఎక్కడున్నారు. నేనొచ్చాను' అంటూ గావు కేకలు పెడ్తూ రంగారావు గారు గృహప్రవేశం చేశారు.

అమ్మా! అనే మాట చెవిని పడగానే, బిడ్డ రంతు విని చేపుకుని అంబా అంటూ పురుగెత్తే ఆవులా, అనసూయమ్మ ఆత్రంగా స్నానం అయిం దనిపించుకుని, ఆదరాబాదరాగా చీర చుట్టుకుంటూ ఇవతలికొచ్చి,

వచ్చావా? రంగా! రెండునాళ్ళుగా నీవు రాలేదంటూ మీ నాన్నగారు కూడా బెంగెట్టుకున్నారు.

మొఖం చూడు ఎలా పీక్కుపోయిందో? భోంచేయలేదా? నీవెక్కడున్నావో? ఏం చేస్తున్నావో? ఏవేని చిక్కుల్లో పడ్డావేమో? అంటూ నేనెంత బెంబేలు పడ్డానని? టీ తాగుదువుగాని రా! అంటూ కన్నీళ్ళొత్తుకుంటూ గోముగా పిలిచింది.

జానకిరామయ్య గారు నోరువిప్పి మాట్లాడలేదు. పేపరేదో చదువుతున్నట్లున్నారు.

తల్లి మాటలకు రంగడు విసురుగా లేస్తూ, ఆమె అజ్ఞతకు నవ్వుతున్నట్లు 'మమ్మీ! అస్తమానం ఇంతవాణ్ణే నీ కళ్లముందెట్లా ఉంటాను. నేను రాలేదనే తపన తప్ప, నా గొప్పతనం గూర్చి, వో స్మాల్, లిటిల్, యాటం అంత తెలుసుకునే ప్రయత్నం చేశావా? లేదు.

చూడు మమ్మీ! నేను యిన్నాళ్లటి రంగణ్ణి కాను. నేను యువతకు లీడర్ని యిప్పుడు నేనంటే పోలీసుకు టెర్రర్ తెలుసా? తెలియదు. నీకెలా తెలుస్తుంది? అయినా! నన్ను గూర్చి నేనెందుకు చెప్పుకోవడం? పేపరు తెరవండి తెలుస్తుంది' అన్నాడు.

కొడుకు మాటలు వింటున్న తండ్రికి మతిపోతున్నట్లుగా వుంది. చేతిలో వున్న పేపరు ఎప్పుడో జారి కింద పడిపోయింది.

'ఏమిటీ విచిత్రం? అంటూ మెడలు సారించి కళ్లెత్తి కొడుకు ముఖంలోకి చూట్టానికి ప్రయత్నిస్తున్నాడు జానకిరామయ్య.'

కొడుకు మాటలు చెవుల్లో పన్నీరు చిలుకరించినట్లుగా వున్నాయి. అయినా? యింతలోకే తన రంగడు సాధించిన ఘనకార్యం ఏమైవుంటుందో? తెలియక తికమకపడ్తాంది తల్లి.

ఇదంతా చూస్తూ తాను ఆశించిన రెస్పాన్స్ రాకపోయేసరికి రంగడు విజృంభణంగా లేస్తూ తండ్రిని ఉద్దేశించి.

'డ్యాడ్! మమ్మీకి న్యూస్ చదివే అలవాటు లేదు కనుక ఆమెకు వార్తావిశేషాలు తెలియవు. మరి మీకో? యింత సంచలనాన్ని సృష్టించిన వార్తనే మీరు చూడలేదా? పిటీ డ్యాడ్! రియల్లీ ఐ పిటీ యూ.

బర్నింగ్ టాపిక్స్ పై వచ్చే తాజా వార్తలు చూచే చురుకు కన్నుమీకెక్కడిది? మంచి యింగ్లీషు, స్టాండర్డు వార్తలంటూ ఆ బోడి హిందూ పేపరు పట్టుకున్కూర్చుంటే ఏం లాభం? మీ కొడుకులాంటి వారి గొప్పతనం ఎలా తెలుస్తుంది? అంటూ తల్లివైపు తిరిగి ''అమ్మా నీవు వెంటనే వెళ్లి రామనాథం, తాయారమ్మ, సౌదామణీ, వాళ్ల యిళ్లల్లో వున్న పేపర్లన్నీ పట్టుకురా! నేనంటే ఎవరో? ఏమిటో? అందరూ తెల్సుకుంటారు యీనాడు. వెళ్లు'' అంటూ తొందరపెట్టాడు.

కొంతసేపు వెనకాముందాడినా 'యింతగా చెబుతూ వుంటే నేను వెళ్లడంలో తప్పేముంది? మంచి విషయం నలుగురి చెవుల్లో పడ్తే మంచిదేగా! అంటూ అనసూయమ్మ గబాగబా వెళ్లి పత్రికలు పట్టుకొచ్చింది.

ఆనాడు ఆదివారం పిల్లలంతా యింట్లోనే వున్నారు. అనసూయమ్మ హడావిడిని చూచిన మూడిళ్లవాళ్లూ 'మనమూ వెళ్లదాం రండ్రా' అంటూ బయలు దేరారు.

ఎన్నడూ లేంది సౌదామిని 'నీవూ రా! పద్మా! వార్తలు విందువుగాని అంటూ అప్యాయతను వలకబోసి పద్మను వెంటేసుకువచ్చింది.

అందరూ కలిసి గలగలా మాట్లాడుకుంటున్నారు. అనసూయమ్మ అతిథుల సత్కారంలో మునిగిపోయింది.

'ఏంటి? బ్రదర్! నిన్ను గూర్చి ఏదో ఘనంగా రైటప్ వచ్చిందంటూ ఇందాకే ఆంటీ చెబితే కంగ్రాట్సు చెప్పుదామంటూ యిలా వచ్చాం ఏమిటీ విశేషం' అంటూ భాస్కర్ రంగణ్ణి ప్రశ్నించాడు.

'భాస్కర్! యింకా విశేషం ఏం? అంటూనే వున్నావా? అయితే పేపర్ లో వార్త చూడలేదన్నమాట! ఏం చదువులు బ్రదర్ మనవి? తరం మళ్లిన మన నాన్నల్లాంటి మాటేమో? కానీ, కాలేజీ కుర్రాళ్లం వేడివేడి వుల్లిపాయ పకోడీల్లాంటి వార్తలు చదవకపోతే ఎలా?

మీరంతా సెల్ఫిష్‌గా పెద్దపెద్ద చదువులూ, డిగ్రీలు అంటూ పూర్తిగా యూత్ సమస్యలు పట్టించుకోవడంలేదు. నాలాంటి వాడేమో మీ అందరికోసం నడుంకట్టి పోరాడుతూ, పోలీసు దెబ్బలు తింటూ జైళ్లకు వెళ్లి సదుపాయాలు కల్పించాలి. అంతైనా కనీసం ఏం జరుగుతుందన్న విషయం కూడా పట్టించుకోరు.

అంతెందుకూ? నా విషయమే చూడండి, నేను సాధించిన విజయం సృష్టించిన సంచలనమే మీకు తెలియదంటే సిగ్గు పడాలి. చూడకేం? చూసే వుంటారు. అంతా జెలసీ, మెచ్చుకునే పెద్ద మనస్సు లేకనే. యిదీ మన కంట్రీ ఫేట్! మన యూత్ ఫ్యూచర్! ఏం జేస్తాం అంటూ హీరో ఫోజ్ పెట్టాడు.

ఈ మాటలు విన్న పక్కింటి పిల్లలంతా నిజంగా తప్పు చేసిన వాళ్లలా ఫీలౌతూ 'సారీ రంగా! ఏదో పొరపాటు జరిగింది. చదువులూ, పరీక్షలంటూ ఈ మధ్య న్యూస్ చదవడమే మానేసినట్లున్నాం' అన్నది విజయ.

'నైట్‌మేర్‌లా ఎప్పుడూ ఎక్కిదిగే బస్సులు ఎక్కడ మిస్ అవుతామోనన్న భయం వెంటాడుతూంటే,,మేమూ వో చిన్నపాటి టైం మిషన్లలా తయారై, వార్తలపట్ల కొంత అశ్రద్ధ ఏర్పడ్డ మాట వాస్తవమే! అయినా నీకు సంబంధించిన వార్త ఏదీ కనిపించ లేదే ?

అన్నది పద్మ ''రంగా! యీ సంతోషవార్త ఏదో నీవే చెప్పరాదు చంపక'' అంటూ భాస్కర్ తొందరపెట్టాడు. అందరూ గొంతు కలిపారు.

రంగడితో పాటూ అందరూ తలో పేపరు పట్టుకుని తమకు కావలసిన ఆ వార్తా విశేషం కోసం గాలింపు ప్రారంభించారు. ఫ్రంట్ పేజ్, హెడ్‌లైన్స్, స్పోర్ట్సు కాలం, సాహిత్యవీధి, వార్తా, దండోరా నగర విలాసం అన్ని కాలమ్స్ వెదికారు. రంగడి పేరు కంటపడక ఒకరి ముఖాలు ఒకరు ప్రశ్నార్థకంగా చూసుకుంటున్న సందర్భంలో హఠాత్తుగా రంగడు వో కేకలాంటిది పెట్టి వుత్సాహంతో వూగిపోతూ..

అబ్బ ! యిక్కడుందోయ్! మన గొప్పను చాటే ఘుమ ఘుమ అంటూ ''నగర ప్రాంతాల్లో పెరిగిపోతున్న రౌడీయిజమ్' అనే హెడ్డింగ్ కింద వున్న వార్తను చదువుతూ చివరకు ' ఇప్పుడు హెల్మెట్లు ధరించకపోవడం నేరంకాదు; ఎవ్వరి తలకు వారే బాధ్యులు అన్న వాక్యాన్ని నొక్కుతూ 'ఇదిరా బ్రదర్ నేను మీకోసం సాధించిన విజయం' అన్నాడు.

ఈ వార్తకూ రంగడి తలపై వారు వుంచవలసిన కీర్తి కిరీటానికీ ఏ పొత్తూ కుదరక అందరి బుద్ధులు స్తంబించినా నవ్వుతున్నట్లే పళ్లిగిలించి నవ్వడమా? ఏడ్వడమా? అంటూ చూస్తున్నారు.

ఇదేం పట్టించుకోని రంగడు జాగింగ్ చేస్తూ తల్లి దగ్గరికి వెళ్లి 'అమ్మా నీ కొడుకంటే ఏవనుకున్నావ్? అసిస్టెంట్ కమీషనరంతటి వారు స్వయంగా ఆసుపత్రికి వచ్చి నన్ను తీసుకొచ్చాడు. రాకేం జేస్తాడూ! అతనికో కూతురుండి వుంటుంది. ఎంతైనా ఆడపిల్ల తండ్రికదా?

ఇంకా అందరి నోళ్లూ తెరిచేవున్నాయి. అది గ్రహించిన రంగడు 'ఇంతకూ నా ఘనతేమిటో మీకు చెప్పనేలేదు కదూ? వినండి' అంటూ ప్రారంభించాడు.

'మమ్మీ! ప్రభుత్వ ఉత్తర్వులను ఖాతర్ చేయని రిబెలియస్ బోల్డు హార్టెడ్ నా ఫ్రెండ్స్ కొందరు హెల్మెట్లు లేకుండా స్కూటర్లు నడుపుతూ, అమ్మాయిలతో కూడా డబుల్, త్రిబుల్ సవారీగా సైకిళ్లు తొక్కుతూ వెళ్లుతూంటే పోలీసు అదుపులోకి తీసుకుంది.

ఆ గదిలో అంతా వూపిరి బిగపట్టి వింటున్నారు.

ఈ వార్తవిన్న నా ప్రాణస్నేహితుడు గోవిందు హుటాహుటి బయలు దేరాడు. అయినా పాపం! వాడి కో సైకిల్‌కానీ, ఆటోకుదుర్చుకునేందుకు జేబులో పావలా డబ్బులు కానీ లేవు. అప్పుడే మార్నింగ్ షికారుగా కొత్తసినిమా పోస్టర్లు చూస్తూ సైకిలు తొక్కుతున్న నేను కంటపడ్డాను. నన్ను పోల్చుకున్న మావాడు వుష్ట్రపక్షిలా రివ్వుమంటూ వచ్చి, వెనక సీట్లోకి నన్ను మార్చి తాను సైకిల్ తొక్కుతూ వుంటే వెళ్లి పోలీస్ స్టేషన్ చేరుకున్నాం.

శ్రోతలకు బొమముడి యింకా విడిపోలేదు.

స్నేహితులందరం, గుంపయ్యాం కలకలం ఎక్కువైంది. యింతలో వో జవాను అందరితో పాటు నన్నూ లాకప్‌లో పెడ్తానంటూ కర్ర ఆడిస్తూ సమీపించాడు. వెర్రివెధవ! నా మెటల్ ఏంటో తెలియని యిడియట్! ఆ మరుక్షణమే నేను మారుతిలా విజృంభించి, అల్లూరి సీతారామరాజులా ముందుకు రయ్యిమంటూ దూకి పిడికిలి బిగించాను.

'అది నేరం రా రంగా!' అన్ని గొంతులూ ఒక్క కుత్తుకై ధ్వనించాయి.

స్నేహితులు పలికిన హెచ్చరికలకు చిరాగ్గా -

'అప్పుడే విమర్శలకు దిగకండి! మీకు ఆలోచించే శక్తిలేకపోయినా వినే వోపిక కూడా లేకుంటే ఎలా? నిజానికి నేను డిఫెన్స్‌గా పిడికిలి బిగించానో! కాక వీరుడిలా తిరుగబడ్డానో నాకే తెలియదు, కానీ జగడమాడి రుస్సు బుస్సుమంటున్న పెళ్లాం మొగుడి షర్టును కసిగా బండకేసి బాది వుతికి ఆరేసినట్లు నన్ను ఆ కాకీ బట్టల దున్నపోతు మొకం వుతికినట్లున్నాడు. ఏద్వైందీ నాకు తెలియదు. నాకు స్పృహ వచ్చేసరికి నేను హాస్పిటల్‌లో వున్నాను.

వుంటే వున్నాను. పరోపకారాయ పుణ్యాయా అంటూ మా అమ్మ ఎప్పుడూ కందరీగలా గుఁయి మంటుంటూంది. ఆ బుద్ధే నాకు దాపురించి యిలా నా శరీరాన్ని మీ అందరి కోసం న్యాసం చేసుకున్నాను.

పచ్చడిగా దంచిన శరీరం లేచే వోపిక లేక కళ్లు తెరిచి మూల్గుతూ లేచి కూర్చునే ప్రయత్నం చేస్తూ వుంటే పోలీసు ఆఫీసరు వచ్చారొచ్చారంటూ నాకు మొకం అదీ కడిగించి వేడి కాఫీ యిచ్చారు నర్సమ్మలు.

వచ్చిన ఆఫీసరు స్పెషల్‌గా నా దగ్గరికి వచ్చి ' ఏం హీరో ఎలా వున్నావ్? యిక ముందు జాగ్రత్తగా మసలుకో. పోలీసుపై చెయ్యెత్తడం నేరం! యిప్పటికైనా తెలిసొచ్చిందా? ఆఁ బైదబై, యికముందు హెల్మెట్లనే వేదింపులు వుండవులే! అంటూ శుభవార్త చెప్పి వెళ్లాడు. ఎంతైనా ఆఫీసరు కదా! నా ఎబిలిటీ గుర్తించి హుందాగానే ప్రవర్తించాడు. డ్యూటీలో ఉన్న ఎంగుసిస్టిర్సు అందరూ చిరునవ్వులతో నన్ను చూస్తూ సాగనంపితే టా! టా! చెబుతూ విస్ఫోటించే ఈ వార్తను మీ చెవుల్లో వేస్తానంటూ యింటి ముఖం పట్టాను.

నేను వచ్చేసరికి వార్తలో యీ తాజావార్తను చూసి మీరంతా జే! జే!! అంటూ వుంటే అమ్మ హారతిచ్చి దిష్టి తీస్తుందనుకున్నాను.' అంటూ ముగించాడు.

వార్త విన్న స్నేహితులు కంగ్రాట్స్ అనే మిషతో 'గ్రాండ్ సక్సెస్, బ్రేవో, అంటూ విరగబడి నవ్వారు.

రాయిబారిన తల్లి తెరచిన నోరు తెరచినట్లే వుంచింది. మళ్లా వస్తామంటూ పెద్దవాళ్లు లేచారు. మరోమాట లేకుండా జానకిరామయ్య అందరికీ చేతులెత్తి సాగనంపాడు.

వాళ్ల వెంటనే 'వస్తాం రా రంగా!' అంటూ వెంబడించారు పిల్లలు.

తేరుకున్న జానకిరామయ్య 'నీ కొడుకు అలసిపోయినట్లున్నాడు. వేన్నీళ్ల కాపడం పెట్టి స్నానం చేయించు' అన్నాడు, భార్యతో.

పొంగులా వస్తున్న దుఃఖాన్నీ, అవమానాన్ని మింగలేని అనసూయమ్మ చీరకొంగుతో ముఖాన్ని కప్పుకుంటూ, భగవంతుడా! అంటూ దేవుడి గదిముందు వాలిపోయింది.

ఇదంతా చూస్తున్న పద్మ వెనక్కొచ్చి అనసూయమ్మను పట్టుకుని ' ఆంటీ! మీరు బాధపడవద్దు. రంగడు అమాయకుడు. మంచి శిక్షణ వుంటే దారికి వస్తాడు. నిరుత్సాహపడకండి' అంటూ కళ్లు తుడిచింది.

అనసూయమ్మ పద్మను గట్టిగా అలుముకుని బావురుమంటూ ఆశగా చూచింది. గడియారం పదిగంటలు కొట్టింది.